తెలుగు దినపత్రిక

# సిద్ధిపేట పవర్

ప్రతిక్షణం ప్రజల పక్షం



విలేకరులు కావలెను

తెలుగు దినపత్రిక సిద్ధిపేట పవర్ ప్రతి క్షణం ప్రజల పక్షం

సిద్ధిపేట జిల్లా నుండి వెలువడే సిద్ధిపేట పవర్ తెలుగు దిన పత్రికలో పని చేయుటకు అన్ని నియోజక వర్గాలు, మండల కేంద్రాల నుండి విలేకరులు కావలెను.. ఆసక్తి ఉన్న వారు సంప్రదించండి

ఫోన్ : 9866338848



శుక్రవారం | 21-02-2025 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు | సంపుటి 01 | సంచిక 34 | వెల : 06 రూ


## గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో

# నరేందర్ రెడ్డి ని గెలిపించండి

- 22న సిద్ధిపేటలో గ్రాడ్యుయేషన్ ఎన్నికల సభ
- నిరుద్యోగులకు అండగా నిలబడిన కాంగ్రెస్ ప్రభుత్వం
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 55వేల ఉద్యోగాలను భర్తీ చేశారు
- ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేరుస్తాం
- బిజెపిని గెలిపించేందుకే బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు
- లిక్కర్ కేసులో కేసీఆర్ కుమార్తె కవిత కేసు కొట్టి వేసేందుకు ఒప్పందం చేసుకున్నారు






సిద్ధిపేట పవర్ దినపత్రిక: సిద్ధిపేటలో ప్రచారాన్ని ప్రారంభించిన సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ . కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన సంవత్సర కాలంలో నిరుద్యోగులకు 55 వేలకు పైగా ఉద్యోగాలను అందించి వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలబడ్డామని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేటలో గ్రాడ్యుయేషన్ ఎన్నికల సందర్భంగా సిద్ధిపేట పట్టణంలోని పలు ప్రైవేట్ కళాశాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ బిజెపి చీకటి స్నేహం బయటపడిందని బిజెపిని గెలిపించేందుకే బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు అని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపికి మద్దతు ఇచ్చేందుకు బిఆర్ఎస్ కుట్ర పన్నిందని అన్నారు. మద్దతు ఇచ్చినందుకు కేసీఆర్ కుమార్తె కవిత జైలు శిక్ష పడకుండా ఉండేందుకు లిక్కర్ కేసు కొట్టివేసేలా ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. ప్రజలకు ఎన్ని మాయమాటలు చెప్పిన మిమ్మల్ని నమ్మే పరిస్థితిలో లేరు అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎన్నికల ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని అన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని



గెలిపించుకొని రాష్ట్ర సంక్షేమానికి పాటుపడాలని అన్నారు. ఈనెల 22న సిద్ధిపేటలో ఎమ్మెల్సీ ఎన్నికల సభ ఉంటుందని ఆ సభకు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి కొండ సురేఖ గారు మంత్రి పొన్నం ప్రభాకర్ గారు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గారు ఇతరులు చాలామంది వస్తారని అన్నారు. మొదటి ప్రాధాన్యతగా నరేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమం సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి, కాలీముద్దీన్, వాహిద్ ఖాన్, దాస అంజయ్య,వాహబ్,సార్, గోపి కృష్ణ, గాయశుద్దీన్, కొత్త మహిపాల్ రెడ్డి, ఎర్ర మహేందర్,బంగారం. శ్రీనివాస్, అరబోలు రాజి రెడ్డి కేమ్మ సారం రాజేష్ ఖన్నా, సాయి ప్రతాప్,కుమార స్వామి,వంశీ తదితరులు పాల్గొన్నారు,

# పోస్టు మెట్రిక్ హాస్టల్ ఉద్యోగులకు కన్వెన్షన్ జీవో వర్తించే లా చేయాలి..

సిద్ధిపేట పవర్ దినపత్రిక: బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ లో ఔట్సోర్సింగ్ విధానంలో పోస్టు మెట్రిక్ హాస్టల్ లో పని చేస్తున్న తమకు కన్వెన్షన్ జీవో వర్తించే విధంగా చేసి తమ జీతాలను ఇప్పించాలని బాధితులు కోరారు. గురువారం సిద్ధిపేట పట్టణంలోని ప్రెస్ క్లబ్ జరిగిన సమావేశం వారు మాట్లాడారు. బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్లో ఔట్సోర్సింగ్ విధానంలో పోస్టు మెట్రిక్ హాస్టల్ లో 49 మంది వర్కర్స్ పనిచేయగా 28 మందికి మాత్రమే కంటిన్యూషన్ జీవో ఇచ్చి మిగిలిన 21 మంది ఉద్యోగులకి వచ్చిన కంటిన్యూషన్ జీవో వర్తించేలా సంబంధిత బీసీ వెల్ఫేర్ మినిస్టర్ సంబంధిత జిల్లా అధికారులు ఈ సమస్య పైన పూర్తిస్థాయిలో విచారణ జరిపి సమస్య పరిష్కరించి ఉద్యోగుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాల్సిందిగా రాష్ట్ర జేఏసీ సిద్ధిపేట జిల్లా జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి శ్రీకాంత్, ఈ కృష్ణ,భిక్షపతి లక్ష్మీ, కల్యాణి, యశోద, డి.జ్యోతి, ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.




# కేసీఆర్ నుంచి ప్రాణభయముంటే ప్రభుత్వాన్ని సంప్రదించండి



మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని కేసు వేసిన రాజలింగమూర్తి. ఇటీవల దారుణ హత్య. ఈ హత్యపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. మాజీ ఎమ్మెల్యే చంపించినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని వ్యాఖ్య. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని కేసు వేసిన రాజలింగమూర్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యపై గాంధీభవన్ లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డే చంపించినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని అన్నారు. న్యాయపరంగా వెళ్లాలి కానీ.. చంపేస్తారా అని ప్రశ్నించారు. మంత్రి కోమటిరెడ్డి ఇంకా మాట్లాడుతూ.. "కేసీఆర్, ఆయన కుటుంబం రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుంది. వారి అక్రమాలను బయటపెడితే చంపేస్తారా? రూ. కోట్లు పోతే సంపాదించుకోవచ్చు. ప్రాణాలు పోతే తిరిగి వస్తాయా? కాళేశ్వరం ప్రాజెక్టు దోపిడీపై రాజలింగమూర్తి పోరాడాడు. ఆయన హత్య ఘటనపై సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తాం. కేసీఆర్ పై న్యాయపోరాటం చేస్తున్న చక్రధర్‌గౌడ్ కు రక్షణ కల్పిస్తాం. కేసీఆర్ నుంచి ప్రాణభయం ఉన్నవారు ప్రభుత్వాన్ని సంప్రదించాలి" అని కోమటిరెడ్డి అన్నారు.

# అందుకే చంద్రబాబు నీళ్లను తరలించుకుపోతున్నారు

- రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదు కాబట్టే కృష్ణా జలాలు తరలించుకుపోతున్నారని విమర్శ
- కేంద్రమంత్రులుగా కిషన్ రెడ్డి, బండి సంజయ్ రాష్ట్రానికి నీళ్లు తెస్తారా? లేదా?
- బీఆర్ఎస్ అధికారంలో లేకపోవడం వల్లే నీటిని తరలించే పరిస్థితి ఏర్పడిందన్న హరీశ్ రావు

కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌనం వహించడం వల్లే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యథేచ్ఛగా నీటిని తరలించుకుపోతున్నారని



బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. కేంద్రమంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ రాష్ట్రానికి నీళ్లు తెస్తారో లేదో తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈరోజు తెలంగాణ భవన్‌లో కృష్ణా జలాల దోపిడీ అంశంపై ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో లేకపోవడంతోనే ఆంధ్రప్రదేశ్ నీటిని తరలించుకుపోయే పరిస్థితి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. బీజేపీ అసలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఖరి తెలంగాణ ప్రజలకు శాపంగా పరిణమించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే నీటి కోసం ప్రధాన మంత్రి కార్యాలయం ఎదుట ధర్నా చేయడానికి కూడా తాను సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. కృష్ణా జలాలు దోపిడీకి గురవుతుంటే ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు పదవులు ఎందుకని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ చేస్తున్న జల దోపిడీ కిషన్ రెడ్డికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరవాలని హితవు పలికారు.

# రాజకీయాల్లో కేసీఆర్ శకం ముగిసింది..

## - కేసీఆర్ చెప్పినంత మాత్రాన తెలంగాణలో కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతుందా?

## - ప్రజలు కాంగ్రెస్ వెంటే ఉన్నారన్న మహేశ్ కుమార్ గౌడ్

## - రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పూర్తిగా తుడిచి పెట్టుకుపోతుందన్న టీపీసీసీ చీఫ్

తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ శకం ముగిసిందని, ఉద్యమ నేతగా మాత్రమే ఆయనను గౌరవిస్తామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కేసీఆర్ చెప్పినంత మాత్రాన తెలంగాణలో కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతుందా అని ఆయన ప్రశ్నించారు. నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ వెంటే ఉన్నారని, తమ గ్రాఫ్ ఎలా పడిపోతుందని నిలదీశారు. ఫామ్ హౌస్‌లో కూర్చొని పెన్ను, పేపర్‌తో గీస్తే గ్రాఫ్ పడిపోతుందా అని ఆయన అన్నారు. రాష్ట్రంలో 56 శాతం బీసీలు తమ వెంటే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఏడాది పాలనలోనే 56 వేల ఉద్యోగాలు ఇచ్చామని, రైతులకు రుణమాఫీతో సహా పలు కీలక హామీలను నెరవేరుస్తుంటే గ్రాఫ్ ఎలా పడిపోతుందో చెప్పాలన్నారు. కేసీఆర్ గ్రాఫ్ మొత్తం నేలమట్టమై ఫామ్ హౌస్‌కు పరిమితమైందని విమర్శించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని వ్యాఖ్యానించారు. తండ్రీకొడుకులు మాత్రమే పార్టీలో ఉంటారని ఆయన అన్నారు. కేసీఆర్‌కు పగటి కలలు కనడం అలవాటుగా మారిందని విమర్శించారు. ఆయన శాశ్వతంగా విశ్రాంతి తీసుకుంటే మంచిదని హితవు పలికారు. పట్టభద్రుల ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టే బలం లేని బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు.




# నేడు వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో సీఎం పర్యటన

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం వికారాబాద్, నారాయణ పేట జిల్లాల్లో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అధికారులు తెలిపిన సమాచారం మేరకు మధ్నాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామానికి చేరుకుంటారు. పోలేపల్లి లో రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో జరిగే పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత నారాయణ పేట మండలం అప్పక్ పల్లి చేరుకుంటారు. అక్కడ జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ను ప్రారంభిస్తారు. బీపీసీఎల్ కంపెనీ సహకారంతో పూర్తిగా మహిళలచే నడిపే పెట్రోల్ బంక్ ఇది. రాష్ట్రంలోనే మొదటి సారి ఈ తరహా బంక్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం అప్పక్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. నారాయణపేట మెడికల్ కాలేజీ లో అకడమిక్ బ్లాక్ తో పాటు–, ఇతర భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు గురుకుల హాస్టల్ ఆవరణలో ఏర్పాటు–చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు.



# హైదరాబాద్‌లో డ్రగ్స్ పార్టీ ఐదుగురి అరెస్ట్!

హైదరాబాద్‌లో డ్రగ్స్ పార్టీపై పోలీసులు దాడులు నిర్వహించారు. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని మాదాపూర్ జీఆర్‌సీ రెసిడెన్సీలో గురువారం డ్రగ్స్ పార్టీ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడులు నిర్వహించిన పోలీసులు గంజాయి సేవిస్తున్న ఐదుగురికి డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలలో డ్రగ్స్ సేవించినట్లు తేలడంతో వెంకటేష్, విజయ రెడ్డి,రాహుల్, శివకుమార్ ప్రియాంక రెడ్డిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా డ్రగ్స్ పార్టీ నిర్వహిస్తున్నట్టు పక్కా సమాచారం అందటంతో సైబరాబాద్ ఎస్వోటీ, నార్సింగి పోలీసులు సంయుక్త దాడులు జరిపారు. తన స్నేహితులతో కలిసి డ్రగ్స్ పార్టీ చేసుకుంటు–న్న ప్రియాంకరెడ్డి గతంలో మత్తు పదార్థాలు సేవిస్తూ పట్టుబడినట్లు పోలీసుల విచారణలో తేలింది. వీరితో పాటు హష్ ఆయిల్ విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకుని నిందితుల నుంచి రూ. 15 లక్షల విలువ చేసే మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.




# సింపుల్? అనిపించే ఈ లక్షణాలే...

కిడ్నీలు దెబ్బతినడానికి సూచికలు!

చాలా మందిలో తెలియకుండానే కిడ్నీ సమస్యలు


మారిన జీవన శైలి, ఆహార అలవాట్లే దీనికి కారణమంటున్న నిపుణులు

కొన్ని రకాల లక్షణాలు కనిపిస్తే...

కిడ్నీలు దెబ్బతిన్నాయనడానికి సూచన అని వెల్లడి



ఇటీవలికాలంలో మారిన జీవన శైలి, ఆహార అలవాట్ల కారణంగా చాలా మందిలో కిడ్నీ సమస్యలు వస్తున్నాయి. కిడ్నీల పనితీరు దెబ్బతిని డయాలసిస్ పరిస్థితి దాకా వెళుతున్నవారు ఎంతో మంది. అయితే కిడ్నీలు దెబ్బతినడానికి సంబంధించి మన శరీరంలో ముందుగానే కొన్ని రకాల లక్షణాలు కనిపిస్తాయని... వాటిని గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే సమస్య తీవ్రతరం కాకుండా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.




ఈ లక్షణాలను జాగ్రత్తగా గమనించండి

కిడ్నీలు దెబ్బతిన్న వారిలో మొదట కనిపించే ప్రాథమిక లక్షణం... కాళ్ల వాపు, ముఖం ఉబ్బిపోవడం. కిడ్నీల పనితీరు దెబ్బతిని, శరీరంలో నుంచి ప్రొటీన్లు బయటికి వెళ్లిపోవడమే దీనికి కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### ఆకలి తగ్గిపోవడం, తీవ్ర నీరసం...

కిడ్నీల పనితీరు తీవ్రంగా దెబ్బతిన్నప్పుడు శరీరంలో రక్త హీనత సమస్య ఏర్పడుతుందని... ఇది తీవ్ర నీరసం, ఆకలి లేకపోవడం వంటి సమస్యలకు కారణం అవుతుందని నిపుణులు చెబుతున్నారు.

### తీవ్ర దురదలు...

కిడ్నీల పనితీరు దెబ్బతింటే... శరీరంలో విష పదార్థాలు, వ్యర్థాలు పేరుకుపోతాయని, ఇవి చర్మంపై ప్రభావం చూపిస్తాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. చర్మం ఎండిపోవడం, మొటిమలు, తరచూ దురదగా ఉంటుండటం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరిస్తున్నారు.

### మూత్రం నురగలా రావడం...

ఉదయం నిద్రలేవగానే టాయిలెట్ కు వెళ్లినప్పుడు మూత్రం నురగలా రావడం కిడ్నీ సమస్య లక్షణమని నిపుణులు చెబుతున్నారు. అది 'ప్రొటెన్యురియా' సమస్య అయి ఉండవచ్చని సూచిస్తున్నారు. ఇక అతి తక్కువగా మూత్రం రావడం, లేదా విపరీతంగా మూత్రం రావడం కూడా కిడ్నీల పనితీరు దెబ్బతినడానికి సంకేతమని పేర్కొంటున్నారు.

### మూత్రంలో రక్తం...

కిడ్నీల్లో రాళ్లు ఏర్పడటం, లేదా మూత్ర నాళ ఇన్ఫెక్షన్లు వంటివి ఏర్పడినప్పుడు మూత్రంలో రక్తం పడటం వంటి సమస్యలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల కొందరిలో నొప్పి ఉంటుందని, మరికొందరిలో నొప్పి ఏమీ ఉండదని వివరిస్తున్నారు. కొన్నిసార్లు ఇలా రక్తం పడటం 'రెనల్ సెల్ కార్సినోమా'గా పిలిచే కేన్సర్ వ్యాధికి సూచిక అయి ఉండవచ్చని చెబుతున్నారు.

### ఈ అంశాలను గుర్తుంచుకోండి...

పైన చెప్పిన లక్షణాలు కనిపించినంత మాత్రాన కిడ్నీలు దెబ్బతినిపోయాయని ఆందోళన చెందవద్దని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కొన్ని ఇతర ఆరోగ్య సమస్యలతోనూ ఇలాంటి లక్షణాలు కనిపించవచ్చని చెబుతున్నారు. అందువల్ల వైద్యులను కలసి, పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచిస్తున్నారు. అంతేకాదు... కిడ్నీలు దెబ్బతినే తొలి దశలో కొందరిలో ఎలాంటి లక్షణాలూ కనిపించవని, అందువల్ల ఏటా వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని చెబుతున్నారు.



